# కామంతో చూడకు దాన్ని

డా॥ ఎ.ఎస్.రామశాస్త్రి

ఆఫీసు నుండి బయటకి వచ్చేసరికి వాన కురుస్తోంది. వాతావరణం వారం రోజులుగా ఇలానే ఉంది.

వాన పడుతున్నప్పుడు నీకేం చెయ్యాలని ఉంటుందని మా ఆవిడని అడిగితే "ఆనంద్ సినిమా లాంటి మంచి కాఫీ తాగాలని ఉంటుంది" అని అంటుంది. అదే మా అమ్మాయిని అడిగితే "గోదావరి మీద పడవలో కూచుని వేడి వేడి పకోడీలు తినాలని ఉంటుంది" అని అంటుంది. నన్నడిగితే – "మోటర్ సైకిల్‌మీద తడుస్తూ వెళ్ళే హేపీడేస్ కావాలి" అని అంటాను.


నేనన్న మాటలో కొంత నిజం ఉంది. కొంత దాపరికం ఉంది. మోటర్ సైకిల్‌మీద తడుస్తూ వెళ్ళాలని ఉండడం నిజం. ఐతే ఒక్కణ్ణే కాదు – నా వెనక ఓ అందమైన అమ్మాయిని కూచోపెట్టుకుని తీసుకు వెళ్ళాలని ఉంటుంది.

మా ఆఫీసుకి దగ్గరగా ఓ అమ్మాయిల స్కూలుంది. అది మా ఇంటికి వెళ్ళే దార్లో లేదు. ఐనా వాన కురిసినప్పుడు అటుపక్క నుండి వెళ్తాను. ఎందుకంటే అందులో మా దూరబ్బంధువుల అమ్మాయి చదువుతోంది. క్లాసు అవడం ఆలస్యమైతే – గేట్ దగ్గర వాన తగ్గడం కోసం నిల్చుని ఉంటుంది. దాన్ని ఇంటిదగ్గర దింపేనెపంతో నా వెనక కూచో పెట్టుకుని వెళ్తాను.

కొంత తడిసిన బట్టల్లో అది నాకు తగు లుతూ కూచుంటే – నాకు బలే థ్రిల్లింగ్‌గా ఉంటుంది. మధ్య మధ్యన కుదుపులకి అది నా మీదకి వాలి పోతోంటే – నాకు ఎంతో హాయిగా అనిపిస్తుంది.

అందుకే మోటర్‌సైకిల్‌ని అటు పక్కకి తిప్పాను – అది అక్కడ ఉంటుందో ఉండదో అని అనుకుంటూ. అక్కడే ఉంది. నేనింకా మోటర్ సైకిల్ ఆపకుండానే దగ్గరికి వచ్చేసింది. నేను ఆపగానే నా వెనక ఎక్కేసి కూచుంది. నేను స్టార్ట్ చెయ్యగానే నా చుట్టూ చేతులు వేసింది.

అమ్మాయిలు తొందరగా ఎదిగిపోతారు. నా కంటికీ, ఒంటికీ – దాని శరీరం ఎదుగుదల స్పష్టంగా తెలుస్తోంది. మనస్సూ ఎదిగే ఉంటుంది. అందుకే ఇంత వాటంగా నన్ను పట్టుకు కూచుంది. అంతేకాదు – నా చెవి దగ్గరగా పెట్టి మాట్లాడ్డం మొదలెట్టింది. మాటల మధ్యలో అమ్మా నాన్నా ఇంకా




ఇంటికి వచ్చి ఉండకపోవచ్చునంది. సాయంగా ఉండడానికి నన్ను ఇంటికి రమ్మంది.

నేనిలాంటి పనులు ఇంతకు ముందు చేసాను. వాళ్ళ అమ్మా నాన్నా ఇంటికి వచ్చే వరకూ దానికి "సాయం" ఉండి, దానితో "ఆడుకుని" – వాళ్ళు రాడానికి ముందుగానే బయల్దేరి వెళ్ళిపోయే వాడిని. అది నాతో నాక్కావల్సినట్లు ఆడినందుకూ, అలా ఆడినట్లు ఎవరితోనూ చెప్పనందుకు – చాక్లెట్లూ, బొమ్మలూ, ఒక్కోసారి డబ్బులు కూడా ఇచ్చేవాడిని.

వాళ్ళింటిముందు మోటర్ సైకిల్ చేరేసరకి, ఇంటి గుమ్మం దగ్గరే వాళ్ళ అమ్మా నాన్నా కని పించారు. ఆ పిల్ల వెనకనుండి దిగుతూ "రండి అంకుల్" అంది. "నాకు పనుంది" అని ఆ అమ్మాయి లతో అని, వాళ్ళ అమ్మానాన్నలకి "బై" చెప్పి బయల్దేరేసాను – ఆరోజు ఆనందం తప్పిపోయిందే అని అనుకుంటూ.

ఆ మూడ్‌తో ఇంటికి చేరేసరికి – ఆఫీస్‌నుండి తొందరగా వచ్చేసిందేమో – శ్రీమతి గుమ్మం దగ్గర నిల్చుని ఉంది. దగ్గరికి వెళ్ళగానే "అమ్మాయి స్కూల్నుండి ఇంకా రాలేదు – వాన కూడా తగ్గడం లేదు – ఒకసారి చూసి వస్తారా?" అని అడిగింది. నేను బయల్దేరబోతోంటే ఇంటిముందు ఓ మోటర్‌సైకిల్ ఆగింది. వెనకనుండి మా అమ్మాయి దిగింది. ముందు కూచున్నతనితో "రండి అంకుల్" అంది. "నాకు పనుంది" అని మా అమ్మాయితో అని మా ఇద్దరికీ "బై" చెప్పి వెళ్ళిపోయా డతను.

ఈ సీనంతా ఓ ఇదునిమిషాల క్రితమే జరిగింది. ఐతే అక్కడ మోటర్ సైకిల్ నడుపుతున్న మనిషిని నేను. నా వెనక కూచున్నది ఎవరో అమ్మాయి. ఇక్కడ మోటర్‌సైకిల్ నడుపుతున్నది ఎవరో. వెనక కూచున్నది నా కూతురు. నా వెనక కూచున్న ఆ అమ్మాయికీ, నా కూతురికీ ఒకటే వయస్సు – పదకొండేళ్ళు. ఆ అమ్మాయి మొహంలో నాకు అందం, ఆశా, మోహం కనిపించాయి. నా కూతురి మొహంలో అందం, అణకువా, అమాయకత్వం కనిపిస్తున్నాయి. నేను సరిగ్గా చూసుంటే నాకు ఆ అమ్మాయిలోనూ అమాయికత్వమే కనిపించి ఉండేదేమో. నా కళ్ళు కామంతో మూసుకు పోయాయి.

"అంకుల్ చాలా మంచివాడు. వానలో నిల్చున్నప్పుడల్లా లిఫ్ట్ ఇస్తూ ఉంటాడు. అప్పుడప్పుడు చాక్లేట్స్ కూడా ఇస్తూ ఉంటాడు" అంటూ లోపలికి వెళ్ళిపోయింది నా కూతురు.

నా గుండె ఆగిపోయినంత పనైంది. కాళ్ళూ చేతులూ స్వాధీనం తప్పినట్లయ్యాయి. గొంతెండిపోయింది.

ఆ వయస్సులో పిల్లలకి పెద్దవాళ్ళ మీద ఎంత నమ్మకం ఉండాలో అంతా ఉంది నా కూతురికి. అదే నమ్మకం నా బంధువుల అమ్మాయికి నామీద ఉండి ఉంటుంది. వాళ్ళమ్మా నాన్నలకీ ఉండి ఉంటుంది. ఆ అమ్మాయికి వరసకి బాబాయిని అవుతాను నేను. నేనేం చేసాను?

అందంగా పువ్వులుగా వికసించబోయే చిన్ని చిన్ని లేత మొగ్గల్ని నలిపెయ్యడం ఎంత పైశాచికమో – ఆ పని చేస్తున్నంత సేపూ నాకు తెలియలేదు. నా కూతురే అలా నలిపివెయ్యబడుతోందేమో అని అనిపించడంతో – అది ఎంత రాక్షసత్వమో ఇప్పుడు తెలుస్తోంది.